## 24

# “మహా దినము ... వచ్చెను”

## (6:12-17)

ఒక వ్యవసాయకుడు ఉండేవాడు; అతన్ని మేము Robert అని పిలిచేవారము. Robert క్రైస్తవుడు, అతడు ప్రభువును ప్రేమించేవాడు. ప్రభువు సంఘం కూడిన ప్రతిసారి అతడు హాజరయ్యేవాడు. అది నాటే కాలమైతే, అతడు ఆరాధనలో ఉండేవాడు, మేఘాలు కమ్మి అతని పొలాలను భయపెడుతున్నప్పుడు, అతడు హాజరౌతూనే ఉండేవాడు. కోత కాలం వచ్చి, తన పంట కూర్చుకునే సమయం దగ్గరపడినా, అతడు యింకను దేవుని ప్రజలతో ఆరాధిస్తూనే ఉండేవాడు. రాబర్ట్ యొక్క సమర్పణ అవిశ్వాసియైన తన పొరుగువానిని పీడించింది. గనుక పరిశోధన కొరకు ఒక పొలాన్ని తన పొరుగువాడు ప్రక్కన ఉంచాడు, రాబర్ట్ ఆరాధనకు వెళ్లిన సమయంలోనే అతడు ఆ పొలంలో పని చేసేవాడు. మరుసటి కోత సమయంలో, రాబర్ట్‌ను పొరుగువాడు తన యింటికి పిలిచాడు. అతడు డబ్బు కట్టలు ఎత్తుగా పేర్చి, “ఈ డబ్బు ఎక్కడనుండి వచ్చిందో నీకు తెలుసా? దేవునికి ప్రార్థించడంలో నీవు నీ సమయాన్ని వ్యర్థం చేసికొంటుండగా పని చేసి నేను దీన్ని సంపాదించాను. ఏ పొలం కంటెను నాకు 30 శాతం ఎక్కువ పంట పండింది! దానికి నీవేమంటావ్?” రాబర్ట్ ఆ డబ్బును చూచి యిలా జవాబిచ్చాడు: “దేవుడు కోత కాలం లెక్కలన్నిటిని సెటిల్ చేయడని నేనంటున్నా.”

మన గత పాఠము అయిదవ ముద్ర, హతసాక్షుల కేకమీద కేంద్రీకరించబడింది! “–నాథా, సత్యస్వరూపీ, పరిశుద్ధుడా, యెందాక తీర్పు తీర్చకయు, మా రక్తము నిమిత్తము భూనివాసులకు ప్రతిదండన చేయకయు ఉందువని బిగ్గరగా కేకలువేసిరి” (6:10). “లెక్కలు చూడడానికి” యింకా కొంత సమయముందన్నట్టు ఆయన చెప్పాడనే నిర్ణయానికి వచ్చాం, అయితే ఏదో యొక దినాన ఆయన లెక్కలు చూస్తాడు. దోషులకు మారుమనస్సు పొందే ఒక అవకాశాన్ని యివ్వడమే ఆయన వేచియుండడానికి కారణమని కూడ చూచాం.

దానికి భిన్నంగా, ప్రస్తుతపు లేఖన భాగం, దేవుని ఓర్పుకు హద్దులున్నాయనే విషయాన్ని మనకు తెలుపగోరుతుంది. తప్పనిసరిగా, “ఇకనేమాత్రము లేదు” అని దేవుడు తెలిపే సమయం వస్తుంది. అది సంభవించినప్పుడు, హెబ్రీ రచయిత యిలా అన్నాడు: “జీవముగల దేవుని చేతిలో పడుట భయంకరము” (హెబ్రీయులకు 10:31). ప్రకటన 6:12-17, అది ఎంత భయంకరమో తెలుపుతుంది:

> ఆయన ఆరవ ముద్రను విప్పినప్పుడు నేను చూడగా పెద్ద భూకంపము కలిగెను. సూర్యుడు కంబళివలె నలుపాయెను,[1] చంద్రబింబమంతయు రక్తవర్ణమాయెను, పెద్ద

> గాలిచేత[2] ఊగులాడు అంజూరపు చెట్టునుండి అకాలపు కాయలు రాలినట్టు ఆకాశ నక్షత్రములు భూమిమీద రాలెను.[3] మరియు ఆకాశమండలము చుట్టబడిన గ్రంథమువలెనై తొలగిపోయెను.[4] ప్రతి కొండయు ప్రతి ద్వీపమును[5] వాటివాటి స్థానములు తప్పెను. భూరాజులును, ఘనులును, సహస్రాధిపతులును, ధనికులును, బలిష్ఠులును, ప్రతి దాసుడును, ప్రతి స్వతంత్రుడును కొండ గుహలలోను బండల సందులలోను దాగుకొని – సింహాసనాసీనుడైయున్నవానియొక్కయు గొఱ్ఱెపిల్లయొక్కయు ఉగ్రత మహాదినము వచ్చెను; దానికి తాళజాలినవాడెవడు? మీరు మామీద పడి ఆయన సన్నిధికిని గొఱ్ఱెపిల్ల ఉగ్రతకును మమ్మును మరుగు చేయుడి అని పర్వతములతోను బండలతోను చెప్పుచున్నారు.

ఒక రచయిత ఈ దృశ్యాన్ని యిలా చిత్రించాడు:

> తటాలున అవ్యక్త స్థితి విశ్వాన్ని కమ్ముకుంది. భూకంపమొకటి లోకమంతటిని కదిలించివేసింది ఏ రిక్టర్ స్కేలు కూడ దాని తాకిడిని కొలవలేకపోయింది. సంపూర్ణంగా సూర్య గ్రహణం జరిగిపోయింది. వాస్తవంగా, సూర్యుడు ... నలుపాయెను, చంద్రబింబమంతయు రక్తవర్ణమాయెను ... ఆకాశ నక్షత్రములు భూమిమీద రాలెను అని యోహాను రిపోర్టిచ్చాడు (ప్రకటన 6:12, 13).
>
> లోకము భయముతో వణకిపోయింది. గొప్ప పట్టణాలు కూలిపోయాయి. దేవుని చివరి తీర్పునుండి తప్పించుకొనడానికి భూరాజులును, యువరాజులును, సైన్యాధిపతులును, ధనికులును, బలిష్ఠులును, దాసులును, స్వతంత్రులును – భూమిమీద మిగిలియున్న ప్రతి నరుడును పరుగులిడుతున్నారు. వారు కొండ గుహలలోనికి పారిపోతున్నారు. బండల సందులలోను కొండ గుట్టల వెనుకను దాగ చూచారు. అయితే తప్పించుకునే వీలులేదు.[6]

ప్రకటన 6:12–17 చదువుతుంటే, ఏ మాటలు నీ మనస్సుకు తట్టుతున్నాయి? నా మనస్సుకు తట్టే మాటలన్నీ ఆంగ్లంలో "T"తో ఆరంభమౌతాయి: "భయము" మరియు "భయంకరమైన," "భయపరచు" మరియు "భయానకం," "బాధించు" మరియు "బాధింపబడు," "భయకంపితమగు" మరియు "గాయం." ఈ లేఖనం నిన్ను ఏ విధమైన భావనతో యింప్రెష్ చేస్తుంది? నాకు కలిగించే యింప్రెషన్ ఏమంటే, "యిది జరిగేటప్పుడు నేను అక్కడ ఉండగోరను!"

దేవుని శత్రువులను తాత్కాలికంగా శిక్షించేదాన్ని సూచిస్తుందా[7] లేక కాలాంతంలో లోకం చివరిగా నాశనం చేయబడడాన్ని సూచిస్తుందనే చర్చలో వ్యాఖ్యానకర్తలు మునిగిపోతారు. ఆ విషయాన్ని మనం చర్చిస్తాం, కాని అది పరిమితియైన ప్రాధాన్యతకు సంబంధించిన ప్రశ్న. నేను టెక్సాస్‌లోని Cleburneలో జీవించేటప్పుడు, వసంత కాలంలో భయంకరమైన తుఫాను పెద్ద వినాశనం జరిగించింది: చెట్లు పెల్లగించబడ్డాయి; సైన్ బోర్డులు, దడులు కూలిపోయాయి; వ్యాపారాలు, యిండ్లు పాడైపోయాయి.[8] పెను తుఫాను యింకా ఏదీ తాకలేదని, పెను తుఫానువంటి గాలులు మాత్రమే కొట్టాయని తుఫాను వెంట వచ్చిన స్థానిక వార్తా పత్రికలు తెలిపాయి; నీ యిల్లే కూలిపోయినప్పుడు, పెను తుఫాను కొడితేనేమి లేక పెను తుఫానువంటి గాలి కొడితేనేమి, "ఆ రెండింటికి వ్యత్యాస మేమి?" అలాగే, దేవుని ఉగ్రత అంటే దేవుని ఉగ్రతయే – అది యిప్పుడైనా లేక క్రీస్తు తిరిగి వచ్చినప్పుడైనా – నన్ను నమ్ము – దాన్ని అనుభవించాలని నీవు కోరవు!

## ఆ దినము వర్ణించబడింది (6:12-17)

12నుండి 17 వచనాలు సహజంగా రెండుగా విభాగింపబడతాయి: విశ్వము ముక్కలు ముక్కలుగా అయ్యే చిత్రం (12–14 వచనాలు), అటు తరువాత, భయకంపితులైన మనుష్యుల చిత్రం (15–17 వచనాలు). (పేజీ 152 చూడు.) మొదట మనం విశ్వం యొక్క వినాశనాన్ని చూద్దాం.

**వినాశన దినం (12–14 వచనాలు)**

6:12–14లో పదజాలాన్ని మొదటిసారి నేను విన్నది తేటగా నాకు జ్ఞాపకముంది. అప్పుడు నేను పదో లేక పదకొండో ఏండ్లవాడను, (Rocky) రాకీ, ఓక్లహోమాలో ఉన్నాను. ఆ దినాన లోకాంతం కాబోతుందని ఒక సువార్తికుడు చెప్పగా తాను విన్నట్టు నా క్లాసు విద్యార్థి నాతో అన్నాడు – సూర్యుడు నల్లగా మారిపోతాడని. చంద్రుడు రక్తంలా మారతాడని, భూమిమీద ఆకాశ నక్షత్రాలు రాలిపడతాయని అతడు ఆ సంగతి చెప్పిన తరువాత, ఆట స్థలంలోని ఒక ఉయ్యాల మీద ఆనుకొని, ఆకాశం తట్టు తేరి చూచి, సూర్యుడు నలుపుగా మారి, చంద్రుడు రక్త వర్ణంగా మారిపోతే ఎలా ఉండబోతుందో అని ఊహింప జూచాను. కొంచెం సేపటిలో నాకు బోరుకొట్టి తిరిగి ఆటలకు వెళ్లాను. ఆ సువార్తికుడు చిత్రించినట్టు లోకం అంతం కాలేదని తరువాత దినాన నాకు తట్టింది.[9]

12నుండి 14 వచనాలు లోకం ఎలా అంతమౌతుందో అక్షరార్థంగా చూపిన చిత్రమా? ప్రభువు తిరిగి వచ్చినప్పుడు ప్రస్తుతపు విశ్వం లయమైపోతుందని బైబిలు నొక్కి చెప్పినా, దాదాపు అవి కాకపోవచ్చు:

> … ప్రభువు దినము దొంగవచ్చినట్లు వచ్చును. ఆ దినమున ఆకాశములు మహా ధ్వనితో గతించి పోవును, పంచభూతములు మిక్కటమైన వేంఢ్రముతో లయమైపోవును, భూమియు దానిమీదనున్న కృత్యములును కాలిపోవును. … ఆకాశములు రవులుకొని లయమైపోవునట్టియు, పంచభూతములు మహావేంఢ్రముతో కరిగి పోవునట్టియు … (2 పేతురు 3:10–12).

లోక వినాశనానికి సంబంధించి[10] ప్రకటన 6:12–14లోని చిత్రం బైబిలు ఉపదేశంతో తప్పక సరితూగుతుంది – కాని ప్రకటన 6లోని కొన్ని వివరాలు అక్షరార్థం అయ్యే వీలుండదు. ఉదాహరణకు, ఆకాశ నక్షత్రాలు భూమిమీదికి రాలతాయా? నక్షత్రాలు భూమికంటె అనేక రెట్లు పెద్దవి, అవి అక్షరార్థంగా “భూమిమీద” పడనేరవు.

12నుండి 14 వచనాలవరకు లోకాంతాన్ని సూచించడానికి యివ్వబడకపోతే, ఆలాటి భాష యోహాను చిత్రించేలా పరిశుద్ధాత్మ ఒప్పుకున్నాడు? తన పాఠకులకు ఎరుకైన సింబాలిజంను యోహాను ఉపయోగించాడు: బైబిలు అంతటిలో కన్పించే సింబాలిజమే, దేవుడు నరుల విషయాల్లో జోక్యం పుచ్చుకొంటున్నాడు (పుచ్చుకుంటాడు) అని ప్రకటించే సింబాలిజం యిది!

పాత నిబంధన పద సమ్మేళనాన్ని ఈ లేఖనం ఉపయోగిస్తుంది. ఉదాహరణకు, యెహెజ్కేలు 38:19లోను, యితర లేఖనాల్లోను ఉన్న భూకంపం యొక్క సింబాలిజం

నీకు కన్పిస్తుంది.[11] భూమి కంపించడం – కదలింపబడనిదిగా భావింపబడేది కదులుతుందనడానికి నిలుస్తుంది. *terra firma* "స్థిరమైన భూమి" అనే పదాలను మనం ఉపయోగిస్తాం. "ఘనీభవమైన భూమియే" మన కాళ్ల క్రింద వణకుతున్నప్పుడు, మనకు భయం కలుగుతుంది. మనం దేనిమీద ఆధారపడి ఉన్నామో అది తీసివేయబడడాన్ని అపొకలిప్టిక్ రచయితలు భూకంపాలను ఉపయోగిస్తారు. నేడు, "భూమిని కంపింపజేసే" అనే పదాలను మనం ఉపయోగించినప్పుడు, మనుష్యులపై ప్రభావాన్ని కనుపరచే సంభవాలను సూచించడానికి వాడతాం.

పాత నిబంధనలో ఉపయోగించబడి ఆలాటి సందేశాన్ని తెలిపే యితర రూప చిత్రాలు ఈ లేఖనంలో ఉన్నాయి: సూర్యుడు చీకటిగాను చంద్రుడు రక్త వర్ణముగాను మారడం యోవేలులో సూచింపబడింది (యోవేలు 2:31),[12] నక్షత్రాలు తొలిగించబడడం, ఆకాశములు "చుట్టబడడాన్ని" గూర్చి యెషయా పలుకుతుంది (యెషయా 34:4). పర్వతాలు కదిలిపోడాన్ని గూర్చిన చిత్రం యిర్మీయా ఉపయోగించాడు (యిర్మీయా 4:24),[13] ద్వీపములు లయమైపోడాన్ని గూర్చి యెహెజ్కేలు రాశాడు (యెహెజ్కేలు 27:35; KJV).[14] దేవుని ఎదిరించిన వారికొరకు వేచియున్న భయాన్ని చిత్రించడానికి గాను తన కాలంలోని ప్రజలు ఊహించగల ప్రతి భయానకమైన విషయాన్ని పేర్చి చూపాడు![15]

12నుండి 14వరకు గల వచనాల్లోని పరి భాషను John Bowman చర్చించినప్పుడు, (నా దృష్టిలో) అతడు దురదృష్టంగా ఉపయోగించడానికి మాటలు ఎన్నుకున్నాడు. అతడు యిలా రాశాడు, "వాటి నిమిత్తమే ఈ లోక సంబంధమైన సంఘటనలను ఎక్కువ తీవ్రంగా తీసికోకూడదు."[16] నేనేమంటానంటే, "ఆ దృశ్యాన్ని *అక్షరార్థంగా* తీసికోనవసరం లేదు, కాని దాన్ని *తీవ్రంగా* తీసికో." గలతీ. 6:7లోని సత్యాన్ని తేటగా అది గుర్తు చేయడమై ఉంటుంది: "... దేవుడు వెక్కిరింపబడడు; మనుష్యుడు ఏమి విత్తునో ఆ పంటనే కోయును"!

## నిరాశతో కూడిన దినం (15, 16 వచనాలు)

తరువాత వచనాల్లో, లోకం యొక్క వినాశనంనుండి దాని ప్రభావానికి వెళ్లుదాం: "భూరాజులును, ఘనులును, సహస్రాధిపతులును, ధనికులును, బలిష్ఠులును, ప్రతి దాసుడును, ప్రతి స్వతంత్రుడును కొండ గూహలలోను బండల సందులలోను దాగుకొని ..."[17] (15 వ.).

15వ వచనంలో ప్రస్తావించిన ఏడు తరగతులవారు మానవ జాతి యావత్తును[18] (ప్రత్యేకించి, దేవుని చిత్తాన్ని వ్యతిరేకించినవారిని) చుట్టి వస్తుంది. యోహాను వ్రాస్తున్న ఆ సమయంలో, "భూరాజులని" జనులు చదివినప్పుడు, చక్రవర్తియైన డొమిషియనును, అతని యిష్టప్రకారం అతని అదుపులో ఏలుబడి చేసిన రాజులందరిని గూర్చి వారు తలంచుతారు. "ఘనులు" అంటే రాజకీయ ఏలికలు కాకుండనే[19] పలుకుబడిగలవారు. భూలోకమందు "ప్రఖ్యాతిగాంచిన ప్రజలు" అని CEV అంది. "సహస్రాధిపతులు" "వెయ్యిమంది సైనికులపై అధికారులు." గ్రీకులో యిదే మాట వాడబడింది. Peterson దీన్ని "generals"[20] అని అన్నాడు.

"ధనికులు" అనేదానికి వివరణ అక్కరలేదు. "బలిష్ఠులు" అనేది భౌతికమైన బలం గలవారిని సూచించదు, దేశంలో బలమైన పలుకుబడిని ఉపయోగించేవారిని సూచిస్తుంది. ఉదాహరణకు, అమెరికాలో, పెద్ద పెట్టుబడిదారులను, క్రీడారంగపు ప్రముఖులను సూచిస్తుంది.[21] ఈ విధంగా రాజకీయ నాయకులను, సైనికాధికారులను, సామాజిక నాయకులను యోహాను సూచించాడు. D. T. Niles యిలా అన్నాడు,

> ... అంతస్థు దేనికి పనికిరాదు. భూరాజులకు సయితం భద్రతలేదు, ధనికులకున్న ఆస్తి భద్రత యివ్వలేదు, ఘనుల యొక్క ప్రభావము శాంతిని ప్రసాదింపలేదు ... జీవితపు ఆధారాలన్నీ విచ్ఛిన్నం చేయబడ్డాయి, భయముచేత జనులు తమ్మును తాము దాచుకున్నారు ... వారి వేషాలన్నిటిని, జీవిత సాధనాలన్నిటిని తొలగించి, దేవుని ఎదుట నిలబడడానికి వారు భయపడతారు.[22]

"ప్రతి దాసుడును ప్రతి స్వతంత్రుడును" అనేది జాబితా చివరికి వస్తుంది. "స్వతంత్రుడు," స్వాతంత్ర్యాన్ని పొందిన గత బానిసయే, అయినప్పటికి యింకను బొటా బొటీలుగా జీవనాన్ని గడిపేవాడు. ఆ దినాల్లో, సమాజపు నిచ్చెన అడుగున బానిసలు, స్వతంత్రులు ఉండేవారు. ఈలాటివారితో పైన పేర్కొనబడిన అయిదు తరగతులవారికి కొద్దో, గొప్పో లేక ఏ సంబంధమును ఉండదు. ఏదియెలాగున్నా, దేవుని ఉగ్రత యెదుట సామాజిక వ్యత్యాసాలు మరువబడతాయి. దేవుడు "పక్షపాతం చూపడు." ఆయన కృప విస్తరింపజేసే సమయంలోనే గాని; తన ఉగ్రతను కుమ్మరించేటప్పుడే గాని ఏ పక్షపాతం చూపడు. (అపొ. 10:34; రోమా 2:9–11 చూడు.)

అల్పులేమి, ఘనులేమి భయకంపితులైనప్పుడు, వారు దాగుకొనడానికి ప్రయత్నిస్తారు. ప్రభువునకు భయపడినప్పుడెల్ల జనులు దాగ ప్రయత్నిస్తారు. ఆదాము హవ్వలు దేవునినుండి దాగ ప్రయత్నించారు (ఆదికాండము 3:8). దేవునికి యోనా అవిధేయుడైనప్పుడు, దేవుని సన్నిధినుండి పారిపోడానికి అతడు ప్రయత్నించాడు (యోనా 1:3). దేవుని యొద్దనుండి దాగడం అసాధ్యమని ప్రతి ఒక్కరు కనుగొన్నారు (కీర్తనలు 139:7–12). అయినా, దోష భరితులు దాక్కొన ప్రయత్నించుతారు. యోహానుచే దాఖలు చేయబడినవారు, "కొండ గుహలలోను బండల సందులలోను దాగుకొని ... సింహాసనాసీనుడైయున్నవానియొక్కయు గొఱ్ఱెపిల్లయొక్కయు ... ఉగ్రతకును మమ్మును మరుగు చేయుడి అని పర్వతములతోను బండలతోను చెప్పుదురు" (15, 16 వచనాలు).[23]

"పాపులు ఎక్కువగా భయపడేది మరణానికి కాదు, కాని ప్రత్యక్షపరచబడిన దేవుని ప్రసన్నతకు."[24] విషయం తెలియని కారణాన మరణము వారిని దేవుని ప్రసన్నత ఎదుటికి బహు తొందరగా నెట్టుతుందని గుర్తించకపోతారు (20:12)!

"గొఱ్ఱెపిల్ల ఉగ్రతకు మమ్మును మరుగు చేయుడి"[25] అని 16వ వచనంలోని ప్రయోగం కామెంట్‌కొరకు కేక వేస్తుంది. (జగడమాడకూడదు) పైబడకూడదని వాదించడానికి పోస్టర్‌గా ఒక ప్రాణిని తీసికొనవలసి వస్తే, ఆదర్శంగా ఎన్నుకోబడేది గొఱ్ఱెపిల్ల. రమ్యంగాను, ఆటకాయతనంగాను ఉండే గొఱ్ఱెపిల్ల, ఎవరికైనా దేనికైనా హాని చేస్తుందని ఎవరు ఊహించగలరు? నీవు ఒక గ్రామంలో నడుస్తూ ఉండగా పెద్ద రాతి బండ

చాటున ఒక వ్యక్తి భయభ్రాంతులతో దాగుకొంటున్నాడనుకో, "ఏమయ్యింది?" అని నీవు అడిగావు. వణకిపోతున్న స్వరంతో, "గొఱ్ఱెపిల్ల నా వెంట పడింది!" అని అతడు బదులిచ్చాడు. ఆ మనిషిని "crackers"[26] అని ఆస్ట్రేలియావారంటారు. న్యూస్ పేపర్ హెడ్‌లైన్ "గొఱ్ఱెపిల్ల దాడి చేసినందున ఒకడు ఆస్పత్రి పాలయ్యాడు" అని ఉంటే, ఆ న్యూస్ పేపర్ తేదీ ఏప్రిల్ 1 ఏమోనని నీవు తనిఖీ చేయవచ్చు.[27]

"గొఱ్ఱెపిల్ల ఉగ్రత" అనే ప్రయోగంలో ఏదో శీతలంగా ఉంది.[28] అలంకరింపబడే పెంపుడు జంతువుచే దాడి చేయబడినట్టు లేక బిడ్డ మనపైకి లేస్తే ఎలాగో, గొఱ్ఱెపిల్ల మనమీద కోపపడడమనే భావన అలాగే ఎదురు చూడనిదై ఉంటుంది. దేవుని యొద్దనుండి దాగ ప్రయత్నించే వారి పాపము యొక్క విస్తారతను అసంగతం నొక్కి పలుకుతుంది. కడకు గొఱ్ఱెపిల్లకే ఉగ్రత తెప్పించడానికి ఆ పాపము ఎంత ఘోరమైనదై ఉంటుందో!

"–నాథా, సత్యస్వరూపీ, పరిశుద్ధుడా, యెందాక తీర్పు తీర్చకయు, మా రక్తము నిమిత్తము భూనివాసులకు ప్రతిదండన చేయకయు ఉందువని" హతసాక్షులు వేసిన కేకలకు ప్రభువు జవాబుగా, విశ్వం లయమైపోవడం, అవిశ్వాసులు నిరాశలో కూలిపోవడం చూచాం (6:10). వారిని హింసించేవారికి – మారుమనస్సు పొందడానికి గాను చాలినంత కాలం, తమ మార్గాలు మార్చుకొనడానికి చాలినంత కాలం ప్రభువు యిస్తారు. అయితే, కడకు, ఆయన తీర్పు తీర్చుతారు; చివరిగా ఆయన పగ తీర్చుకుంటారు. అంతంలో దేవుడు "దహించు అగ్నియై ఉంటాడు" (హెబ్రీయులకు 12:29)!

## ఆ దినము చర్చించబడింది (6:17)

**ఎప్పుడు? అనే ప్రశ్న అంత ప్రాముఖ్యం కాదు:**

మన స్టడీ కొనసాగుతుండగా, "దేవుడు రోమా సామ్రాజ్యాన్ని నాశనం చేయడాన్ని గూర్చి యిది మాట్లాడబడిందా, లేక కాలాంతమందు విశ్వాన్ని లయపరచడాన్ని గూర్చి యిది మాట్లాడబడిందా?" అని ఎరుగగోరి నిర్బంధిస్తున్న స్వరాల రద్దీని నేను వింటున్నాను. ఈ ప్రశ్న మీద వ్యాఖ్యానకర్తలు సమంగా విభాగింపబడ్డారు.[29]

6:12–17లోని ప్రతిపాదన దేవుడు రోమా సామ్రాజ్యాన్ని కూలద్రోయడాన్ని సూచించవచ్చు. ముందుగా యివ్వబడిన రెఫరెన్సులో – పాత నిబంధన ప్రవక్తలు భూకంపాలను గూర్చి పలికినప్పుడు – సూర్యుడు చీకటిగాను చంద్రుడు రక్తవర్ణముగాను మారడం, ఆకాశ నక్షత్రాలు పడిపోవడం అని వర్ణించారు – ఆ రచయితలు సాధారణంగా, దేవుని ఎదిరించిన బబులోను, అష్షూరు మొదలైన దేశాలపైన తాత్కాలికమైన శిక్షను ప్రవచించారు. త్రోసివేయబడనేరనివి లేక జయించబడనివిగా కన్పించిన దేశాలను దేవుడు గతంలో నాశనం చేసిన సంగతిని యోహాను పాఠకులు గుర్తు చేయబడతారు. అదే విధంగా, రోమును దేవుడు దింపివేస్తాడు.

"యెందాక తీర్పు తీర్చకయు, మా రక్తము నిమిత్తము భూనివాసులకు ప్రతిదండన చేయకయు ఉందువనే" హతసాక్షుల కేకలకు బదులుగా, రోమా సామ్రాజ్యపు ఓటమి

నేరైనది, వ్యక్తిగతమైనది, ప్రత్యేకమైనది నిశ్చయం: రోమా ప్రభుత్వం క్రైస్తవుల రక్తాన్ని ఒలికించినందున, రోమా ప్రభుత్వం శిక్షింపబడాలని దేవుని న్యాయం తప్పక డిమాండ్ చేస్తుంది. దీనికి సంబంధించి, ప్రకటన 17నుండి 19 అధ్యాయాలు చదువు. మహా బబులోను (అంటే, రోము[30]) యొక్క నాశనాన్ని చిత్రించిన మీదట, 19:1బి, 2లోని మాటలతో మహా జనసమూహము పరలోకమందు దేవుని స్తుతులను పాడింది: "రక్షణ మహిమ ప్రభావములు దేవునికే చెల్లును; … తన వ్యభిచారముతో భూలోకమును చెరిపిన గొప్ప వేశ్యకు ఆయన తీర్పు తీర్చి తన దాసుల రక్తమును బట్టి దానికి ప్రతిదండన చేసెను." ఈ వచనాలు నేరుగా 6:10లోని విన్నపానికి సంబంధమున్నట్టు అనేకులు నమ్ముతారు, వారు కరక్టే అయ్యుండవచ్చు.[31]

మరోవైపు, 6:12-17 చివరి "ఉగ్రత యొక్క మహా దినంగా" దీన్ని భావించవచ్చు. ఈ పక్షం వహించేవారు ఈ క్రింది రుజువులను చూపుతారు: (1) ఏ ఒక్క పాత నిబంధన లేఖనం సయితం నాశనానికి సంబంధించిన ఈ చిత్రాలన్నిటిని ఏకం చేయదు. (2) ఈ అలంకారంలోని కొన్ని విషయాలు లోకాంతమందు జరిగే సంభవాలను గుర్తు చేస్తాయి. ఇందులో మానవాళినంతటిని సమకూర్చడం ఒకటి (2 కొరింథీయులకు 5:10) మరియు తండ్రిని, కుమారుని సార్వత్రికంగా గుర్తించడం (ఫిలిప్పీయులకు 2:11). (3) గొఱ్ఱెపిల్లను ప్రస్తావించడం ఈ దృశ్యాన్ని ఏకైకంగా చేస్తుంది. పాత నిబంధన లేఖన భాగాలు క్రీస్తును చేర్చలేదు.

"మనం జయించాం, దేవునికి స్తోత్రము!" అనే పరిచయ పాఠం ప్రకటనలోని ఏడు భాగాలను అవుట్‌లైను చేస్తుంది. ప్రతి భాగం క్రైస్తవ యుగమంతటిని కలుపుతుంది. "క్రీస్తు మొదటి రాకడనుండి రెండవ రాకడవరకు."[32] 6:12-17లోని దృశ్యం 1:7లో గతంలో యివ్వబడిన రెండవ రాకడ కొరకు యివ్వబడిన చిత్రంతో సరిపోతుంది: "ఇదిగో ఆయన మేఘారూఢుడై వచ్చుచున్నాడు, ప్రతి నేత్రము ఆయనను చూచును … భూజనులందరు ఆయనను చూచి రొమ్ము కొట్టుకొందురు …"[33] ఈ హేతువును బట్టి, 6:12-17 చివరి ఉగ్రత దినాన్ని సూచిస్తుందనే భావనకు నేను మొగ్గుతున్నాను.

ఇంకను, యిందులో పెద్ద వ్యత్యాసమున్నట్టు నేను చూడలేదు. ఈ లేఖనం ప్రాథమికంగా రోమా సామ్రాజ్య నాశనాన్ని గూర్చి సూచించినట్టయితే, దేవునికి వ్యతిరేకంగా నిలిచే ఎవనినైనా హెచ్చరించుచూ, చివరి మహాదినానికి ముంగుర్తుగా ఉంది. అది చివరి మహాదినాన్ని గూర్చి మాట్లాడినట్టయితే, రోమా సామ్రాజ్యంతో చేర్చి – ప్రభువును ఎవడు వ్యతిరేకించినా – తప్పకుండా కడకు ఆయన మహోగ్రతను చవి చూస్తాడు అని అది ఉపదేశిస్తుంది.

ఈ భాగం తాత్కాలికమైన శిక్షను గూర్చియా లేక నిత్య శిక్షను గూర్చి మాట్లాడుతుందా అనే ప్రశ్న చెప్పుకోదగినంత ప్రాముఖ్యమయ్యింది కాదు. ఉగ్రత మహా దినం రాబోతుందనేది ఈ భాగం నొక్కి చెప్పే సందేశమై ఉంటుంది. బబులోనీయుల కొరకు ఉగ్రత యొక్క మహా దినం ఉండింది, అష్షూరీయులకు మహోగ్రత దినముండింది, రోమీయులకొరకు ఉగ్రత మహా దినం ఉండింది, దేవుని ప్రేమా ఏర్పాట్లను నేడు అలక్ష్యం చేసే సమస్త జనుల మీద ఆయన ఉగ్రత దినం వస్తుంది (రోమా 2:5; ఎఫెసీయులకు 5:6)!

జీవితానికి అది ఏదైనా అర్థం కలిగించితే, మహా గొప్ప కడపటి రంగాన్ని మనం చూడాలి. మానవ చరిత్ర అర్థరహితంగా నిరంతరం చుట్టు తిరుగుతుండే అంతం లేని కాల చక్రం కాదు. కాని చరిత్ర "నిర్దిష్టమైన గమ్యాన్ని చేరే పయనమైయుంది."[34] మనం గడిపే ప్రతి దినం, లోకాంతానికి, నిత్యత్వానికి, పరలోకానికి లేదా నరకానికి మనం దగ్గరకు చేరుకుంటున్నాం! ప్రకటన 6:12–17ల వంటి భాగాలు, దుష్టుల విజయం తాత్కాలికమయ్యింది,[35] తీర్పు నిశ్చయమని ప్రకటిస్తున్నాయి![36] దేవుడు తన సొంత ఉద్దేశాలకొరకు తన ఉగ్రతను కనుపరచడంలో కొంత ఆలస్యం చేయవచ్చు – అయితే ఉగ్రత దినం రానైయుంది – ప్రతి వ్యక్తి దానికొరకు సిద్ధపడవలసిన అవసరముంది.

**ఎక్కువ విశేషమైన ప్రశ్న ఏమంటే: ఎవరు? (17 వ.)**

ఎక్కువ విశేషమైన ప్రశ్న 17వ వచనంలో కన్పిస్తుంది: "... ఉగ్రత దినము వచ్చెను, *దానికి తాళజాలినవాడెవడు?*" (నొక్కి పలకడం నాది.)

9నుండి 11వరకు చిత్రింపబడినవారికిని, 15నుండి 17వరకు చిత్రింపబడినవారికిని మధ్య పలు తారతమ్యాలను చూస్తాం. ఒక వ్యత్యాసమేమంటే, హతసాక్షులు "మాకు న్యాయం తీర్చండి" అన్నట్టు కేక వేశారు! అదే సమయంలో "మమ్మును దాచుడి" అని కేక వేశారు! శ్రమ వారిని దేవునినుండి ఎడబాపలేదు, కాని పాపం చేసింది. బహు వ్యత్యాసమైన ప్రశ్నను ప్రతి గుంపువారు అడిగారు: హతసాక్షులు "ఎందాక?" అని తెలిసికో గోరారు, భయభ్రాంతులతో నిండినవారు "ఎవరు నిలువగలరు?" అని అడిగారు.

"ఎవరు నిలువగలరు?" అనే ప్రశ్న గతంలో అడుగబడింది. నహూము యిలా రాసాడు, "ఆయన ఉగ్రతను సంహింపగలవాడెవడు? ఆయన కోపాగ్నియెదుట నిలువగలవాడెవడు? ఆయన కోపము అగ్నివలె పారును, ఆయన కొండలను కొట్టగా అవి బద్దలగును" (నహూము 1:6). మలాకీ కూడ యిలా అడిగాడు, "అయితే ఆయన వచ్చుదినమును ఎవరు సహింపగలరు? ఆయన అగుపడగా ఎవరు ఓర్వగలరు? ఆయన కంసాలి అగ్నివంటివాడు ..." (మలాకీ 3:2). తాను ప్రార్థించినప్పుడు ఎజ్రా ఈ ప్రశ్నకు జవాబు యిచ్చాడు, "యెహోవా ఇశ్రాయేలీయుల దేవా, ... మేము నీ సన్నిధిని అపరాధులము గనుక నీ సన్నిధిని నిలుచుటకు అర్హులము కాము" (ఎజ్రా 9:15). దేవుని యెదుట ఎవడును నిలువలేడు – అంటే, సిద్ధపడని ఎవడును (అని అర్థం).

Edward Myers యిలా కామెంట్ చేశాడు, " 'మరియు ఎవడు నిలువగలడు?' అనేది మహా అద్భుతమైన దేవుని కృపను నిరాకరించినవారి నిరీక్షణ లేని స్థితిని అది వ్యక్తపరచుతుంది. భక్తిహీనమైన ప్రతి జీవితంలోనుండి చివరి అర్థాన్ని దోచుకొనిపోయే శిక్ష విధించు ప్రశ్నార్థకమైయుంది."[37]

మన తరువాత పాఠంలో, 7వ అధ్యాయం మనం చదువుతాం, భక్తుల పట్ల దేవుని భద్రతయు బహుమానమును (చర్చింపబడుతుంది). "యెవడును లెక్కింపజాలని యొక గొప్ప సమూహము కనబడెను. వారు ... సింహాసనము ఎదుటను గొఱ్ఱెపిల్ల యెదుటను *నిలువబడి*" అని 9వ వచనంలో మనం చదువుతాం. "ఎందాక?" అని హతసాక్షులు కేకలు వేసిన సమయంలో, హింసించేవారు నిలిచియున్నారు, హింసింపబడినవారి దేహాలు

చనిపోయిన రీతిని వీధులలో పడియున్నాయి. చివరిలోనైతే, దేవుని ప్రజలు నిలిచియుండగా – దుష్టులు దేవుని కోపముచే కూలిపోయారు!

## ముగింపు

చాల సంవత్సరాల క్రిందట సహోదరుడు Will Thompson "ఒక మహా దినం వస్తుంది" అనే పాట రాశాడు. దాని సందేశం నేటికిని నన్ను కదిలిస్తుంది:

> ఒక మహా దినం వస్తుంది,
> ఒక మహా దినం వస్తుంది,
> మెల్ల మెల్లగా ఒక మహా దినం వస్తూ ఉంది;
> అప్పుడు నీతిమంతులు పాపులు కుడి యెడమలకు వేరు చేయబడతారు,
> ఆ దినపు రాకకు నీవు ఆయత్తమైయున్నావా?
>
> ప్రకాశమానమైన దినం ఒకటి వస్తుంది
> ప్రకాశమానమైన దినం వస్తుంది
> ప్రకాశమానమైన దినం మెల్ల మెల్లగా వస్తుంది;
> ప్రభువును ప్రేమించేవారికే ఆ ప్రకాశమానమైనది వస్తుంది,
> ఆ దినం కొరకు నీవు ఆయత్తమైయున్నావా?
>
> ఒక విషాదకరమైన దినం వస్తుంది,
> విషాదకరమైన దినం వస్తుంది,
> విషాదకరమైన దినం మెల్ల మెల్లగా వస్తుంది;
> నేను మిమ్మునెరుగను వెళ్లుడి అని పాపి తన నాశనం వినే దినం వస్తుంది.
> ఆ దినం కొరకు నీవు ఆయత్తమైయున్నావా?[38]

ప్రభువు తిరిగి వచ్చు దినము, "మహా దినంగా," "మెరుగైన దినంగా" ఉండ బోతుందా? లేక "దుఃఖ దినంగా" ఉండబోతుందా? ఆ దినం రావడానికి నీవు ఆయత్తమైయున్నావా? నీవు యింకను నీ పాపంలోనే ఉంటే, నీవు సిద్ధంగా లేవు. ఇటీవల, Glen Pace ఈ ప్రతిపాదనలను చేశాడు:

> పాపము నీవు వెళ్లదలచిన దానికంటెను ఎక్కువ దూరం నిన్ను తీసికొని వెళ్లుతుంది.
> పాపము నీవు కోరుకున్న దానికంటెను ఎక్కువ కాలము నిన్ను నిలుపుతుంది.
> పాపము నీవు చెల్లింపగల దానికంటెను ఎక్కువ వెలను కోరుతుంది.
> పాపము నీవు ఊహించే దానికంటెను ఎక్కువైన హాని నీకు చేస్తుంది.[39]

దేవుని ఉగ్రతనుండి దాగుకొనడానికి జనులు ప్రయత్నించినప్పుడు, లోక సంబంధమైన బండలు బహు స్వల్పమైనవిగా కన్పిస్తాయి. దేవుని ఉగ్రతనుండి ఒకే భద్రతనిచ్చేది యుగముల బండ, యేసుక్రీస్తు[40] "రాబోవు ఉగ్రతనుండి మనలను తప్పించేవారు యేసే" (1 థెస్సలొనీకయులకు 1:10). నీవు నీ జీవితాన్ని ఆయనకు అప్పగించుకున్నావా? నీ యిష్టాన్ని ఆయనకు లోబరచావా? లేనట్టయితే, నేడే

ఆయనయందు నమ్మికయుంచి ఆయనకు లోబడు![41]

## ఉపదేశకులకు, సువార్తికులకు నోట్సు

గత పాఠంలో సింపుల్ డ్రాయింగ్ ఉపయోగింపబడింది:

**ఈ లోకంలో**

**భక్తిగలవారు** **భక్తిహీనులు**



ఈ పాఠంలో, డ్రాయింగ్ రివైజ్ చేయబడింది:

**రాబోవు లోకంలో**

**భక్తిగలవారు** **భక్తిహీనులు**



"గొఱ్ఱెపిల్ల ఉగ్రత," "దేవునినుండి నీవు దాగలేవు!" "ఎవరు నిలువగలరు?" అనే యితర పేర్లు ఈ పాఠానికి పెట్టవచ్చు.

5, 6 ముద్రలు ఒకే పాఠంలో నీవు కవర్ చేయగోరితే, "సరియైన మార్గము, తప్పు మార్గము" అని చెప్పవచ్చు. ఐదవ ముద్ర "శ్రమలకు స్పందించటం ఎలా" అనేదాన్ని వివరించవచ్చు: (1) హింసను గూర్చి అక్కర కలిగియుండడం సరియే. (2) హింస వచ్చినప్పుడు, దేవునికి దూరమయ్యే దానికంటె దేవుని యొద్దకు మరలు. (3) నీవు పగ తీర్చుకొనవద్దు, ఆలాటి విషయాలను దేవునికి విడిచిపెట్టు. ఆరవ ముద్ర "తీర్పుకు సిద్ధపడే తప్పుడు మార్గం": (1) తీర్పు వచ్చేవరకు ఏమియు చేయకు. (2) దేవుని ఉగ్రతకు దాగు చోటు కానిది ఈ లోకపు బసయని ఆలోచించు. (3) తీర్పు వచ్చినప్పుడు, సందు చేసికొని దూరడానికి ప్రయత్నించు.

6వ అధ్యాయాన్ని ఒకే ఒక పాఠంలో కవర్ చేసికోగోరితే, Merrill C. Tenney ఈ అవుట్‌లైన్ వేశాడు: (1) చరిత్ర యొక్క చబుకు దెబ్బలు (ఒకటినుండి నాలుగు

ముద్రలు), (2) పరిశుద్ధుల బాధలు (అయిదవ ముద్ర), (3) ఆకాశాలు కదిలింపబడడం (ఆరవ ముద్ర).[42]

6వ అధ్యాయానికి మరొక సంధింపు విధానం "సంకటం మీద దేవుని ఏడు పాయింట్ల ప్రసంగం." సాధ్యమయ్యే మెయిన్ పాయింట్లు: (1) సంకటము – నీవు తప్పించుకోలేవు! (మొదటి ముద్ర); (2) సంకటం నీ హృదయాన్ని పగులగొట్టవచ్చు (రెండవ ముద్ర); (3) సంకటము నీ ఆత్మను పగులగొట్టవచ్చు (మూడవ ముద్ర); (4) సంకటము నీ ప్రాణాన్ని తీయవచ్చు (నాల్గవ ముద్ర); (5) సంకటము రెండంతల ప్రయాణంతో వస్తుంది (విశ్వాసులకు) (అయిదవ ముద్ర); (6) పట్టించుకోవలసిన సంకటం అవిశ్వాసుల మీదికి మాత్రమే వస్తుంది (ఆరవ ముద్ర); (7) నేటి సంకటాలను సహించడానికి దేవుడు సహాయపడతాడు – సంకటం లేని రేపటిని వాగ్దానం చేస్తాడు! (7వ అధ్యాయం). ఈ పంథాను 6వ అధ్యాయంతో ఉపయోగించితే, 7వ అధ్యాయంలో రాబోయేదానికి సాధకంగా దాన్ని ప్రస్తావించవచ్చు. ఇది రెండు భాగాల పాఠంగా, ప్రసంగంగా, మొదటి నాలుగు పాయింట్లు ఉదయాన, చివరి మూడు పాయింట్లు సాయంత్రం ప్రసంగించవచ్చు.

---

సూచనలు

[1]గోనెగుడ్డ గోనెలు చేయడానికిని, దుఃఖ సమయంలో ధరించుకొనడానికిని ఉపయోగించే (మొద్దు గుడ్డ.) ముతక గుడ్డ. నల్ల మేక వెంట్రుకలనుండి ఈ ప్రత్యేకమైన గోనె గుడ్డ చేయబడింది. [2]నక్షత్రాలు పడడమంటే, ప్రముఖులు పతనమవ్వడమని కొందరు తలంచుతారు. కొన్నిసార్లు పాత నిబంధనలో గొప్పవారు నక్షత్రములుగా చెప్పబడ్డారు. ప్రకటన 6లో, నక్షత్రాలు పడడమనే అలంకారం ఈ సంపూర్ణ చిత్రాన్ని మించిన ఉద్దేశం లేనట్టుంది. [3]ఇవి శీతా కాలంలో వచ్చే అంజూరాలు రకం, "పరిపక్వానికి రాక, ఆకులు చిగురు పెట్టు కాలంలో పడిపోతాయి" (Homer Hailey, *Revelation: An Introduction and Commentary* [Grand Rapids, Mich.: Baker Book House, 1979], 198). [4]తెరిచి ఉంచకపోతే కాగితపు చుట్ట చుట్టుకుపోతుంది. ఎండిపోయిన చేతిప్రతి తెరచి పట్టుకున్నప్పుడు, చివరలు ముడుచుకుంటాయి. అలాగే ఆకాశం తునిగి ముక్కలై పోతున్నట్టు చిత్రింపబడింది. Eugene H. Peterson మనలో ఎక్కువ మందికి తెలిసిన చిత్రాన్ని ఉపయోగించాడు: "ఆకాశము తునిగిపోయి గ్రంథంలా మూయబడింది" (*The Message: New Testament With Psalms and Proverbs* [Colorado Springs, Colo.: NavPress Publishing Group, 1995], 618). గ్రంథాన్ని గట్టిగా తటాలున మూసి దృశ్యమైన ఉదాహరణగా చూపవచ్చు. [5]పర్వతాలు ద్వీపాలు దగ్గర సంబంధం కలిగి ఉన్నాయి. ద్వీపమంటే సముద్రం మధ్యలో నిలిచిన ఒక పర్వతమే. ఈ సందర్భంలో, భూమిమీద ఏ భాగం కూడ తప్పించుకోదని నొక్కి పలకడానికి కాబోలు "ద్వీపాలు" ఉపయోగించబడ్డాయి. [6]Billy Graham, *Approaching Hoofbeats: The Four Horsemen of the Apocalypse* (New York: Avon Books, 1985), 241. [7]మరో మాటల్లో, ఇది రోమా సామ్రాజ్యాన్ని శిక్షించడాన్ని సూచించుతున్నట్టు కొందరు తలంచారు. [8]ఆరు సంవత్సరాలలోపు, నేను నా భార్య కిటికీ అద్దాలు, గేట్లు, బయట యింకా పగిలే వస్తువులు రెండు పై కప్పులు మరల వేయించవలసి వచ్చింది. [9]క్రీస్తు రాకడకు ఖచ్చితమైన సమయం ఎవడైనా చెప్పితే, అతడు అబద్ధ ప్రవక్తయని నీవు తెలిసికోవచ్చు (మత్తయి 24:36–44). [10]సమస్తము పరమాణువులచే చేయబడినందున, ఈ అణువులు వేరు వేరుగా చెదరిపోవచ్చు ప్రకటన 6:12–14 ఒకప్పుడు తోచినంత వింతగా వినిపించదు.

[11]యిర్మీయా 4:24; యోవేలు 2:10; ఆమోసు 8:8; హగ్గయి 2:6 చూడు. [12]యెషయా 13:10; 50:3; యెహెజ్కేలు 32:7; ఆమోసు 8:9 చూడు. [13]నహూము 1:5 చూడు. [14]యెహెజ్కేలు 26:15, 18; KJV. [15]ఈ ప్రతిపాదన William Barclay, *The Revelation of John,* vol. 2, rev. ed., The Daily Study Bible Series (Philadelphia: Westminster Press, 1976), 15నుండి తీయబడింది. [16]John Wick Bowman, *The First Christian Drama: The Book of Revelation* (Philadelphia: Westminster Press, 1955), 53.

[17]పర్వతములలోను, గుహలలోను దేవుని యొద్దనుండి దాగుకొనడం హోషేయ 10:8; యెషయా 2:19లో ఉపయోగించబడింది. యెరూషలేముపై వచ్చే కలవరములను గూర్చి మాట్లాడే సమయంలో యేసు ఈ అలంకారాన్ని తీసికొన్నారు (లూకా 23:30). [18]ఏడు అనే అంకె సంపూర్ణతను సూచిస్తుంది. [19]గ్రీకులో "గొప్ప మనుష్యులు" లేక "గొప్పవారు" అనేది అక్షరార్థం. అదే పదం 18:23లో కన్పిస్తుంది, అక్కడ అది ప్రాముఖ్యమైన వ్యాపారులను సూచిస్తుంది. కొన్ని తర్జుమాలలో ఆ పదం "princes" అని ఉంది. [20]Peterson, 618.

[21]మీ ప్రాంతంలో గొప్ప పలుకుబడిగలవారిని ఉదాహరణగా యిమ్ము. [22]D. T. Niles, *As Seeing the Invisible: A Study of the Book of Revelation* (New York: Harper & Brothers, Publishers, 1961), 60-61. [23]భయమొందిన జంతువు దాగ ప్రయత్నించింది నీవెప్పుడైనా చూచినట్టయితే, ఆ మనుష్యుల యొక్క అర్థ రహితమైన స్థితికి ఉదాహరణగా వాడవచ్చు, నా మనస్సుకు వచ్చే ఉదాహరణ మా పాప యొక్క కుక్క మా పిల్లిని భయపెట్టినప్పటి సంఘటన. [24]Henry B. Swete, *The Apocalypse of St. John* (Cambridge: MacMillan Co., 1908; reprint, Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., n.d.), 94. [25]"గొఱ్ఱెపిల్ల ఉగ్రత" అనే ప్రయోగంతో కొందరు వ్యాఖ్యానకర్తలు అసౌకర్యంగా ఉన్నారు; ఈ భాగంలో, విశ్వాసులు కాదు, అవిశ్వాసులు ఈ ప్రయోగాన్ని వాడినట్టు వారన్నారు. అయినా, "దేవుని ఉగ్రతతో" ప్రకటన తడిచింది (14:10, 19; 15:1, 7; 16:1; 19:15; 11:18; 16:19లను కూడ చూడు). దేవుని సింహాసనము గొఱ్ఱెపిల్ల సింహాసనము కూడ (22:3); ఒకరు ఏమి చేస్తే రెండవవారు కూడ అదే చేసినట్టు చెప్పబడింది. ప్రకటనలో తరచుగా, యేసు దుష్టులను శిక్షిస్తున్నట్టు చిత్రింపబడ్డారు (2:16, 22, 23; 17:14; 19:11–21). "గొఱ్ఱెపిల్ల ఉగ్రత" అనేది మిగిలిన గ్రంథానికి పొందికగానే ఉంది. [26]"Crackers" అని ఆస్ట్రేలియాలో ప్రయోగానికి "వెర్రివారని" అర్థం. [27]U.S.లో ఏప్రిల్ 1 అంటే "April Fools' Day" అని ప్రాక్టికల్ జోక్స్ వేసికొనే దినం. దిన పత్రికలు "ఏప్రిల్ ఫూల్స్" అని ముగింపుతో కూడిన వ్యాసాలను ప్రచురిస్తాయి. [28]నవయుగపు భయానకమైన కథల్లో ఎదురు చూడని వ్యతిరేకత కన్పిస్తుంది. [29]ఈ ప్రతిపాదన వెయ్యేండ్ల పాలన వాదుల కామెంటరీలో చేర్చబడలేదు. 4నుండి 19 అధ్యాయాలవరకు ఏడేండ్ల "శ్రమల కాలాన్ని" గూర్చి తెలుపుతుందనే వారి వ్యాఖ్యానాన్ని అనుసరించి దీన్ని వారు మెలికలు వేశారు. [30]వేశ్య మహా బబులోను అనేది రోము. మహా బబులోను "ఆ స్త్రీ భూరాజులనేలు ఆ మహా పట్టణమే" (17:18), ఆ యేడు తలలు ఆ స్త్రీ కూర్చున్న "యేడు కొండలు" (17:9). రోము ఏడు కొండలమీద కట్టబడింది.

[31]ఈ కేవలం ప్రత్యేకించి రోమా సామ్రాజ్య పతనానికి మాత్రమే ఉపయోగింపబడిందని, "కాలాంతమందు విశ్వం నాశనాన్ని యిది సూచించలేదని, అది కేవలం 'కనురెప్పపాటులోనే' జరిగిపోతుందని (1 కొరింథీయులకు 15:52) వాదించే కొందరు దీన్ని వాడారు." ఇది సింబలైయున్నందున, సింబల్లో ఏదైనా జరుగవచ్చు, ఆ ఆర్గ్యూమెంట్ గొప్ప బరువయ్యిందిగా కన్పించదు. మరో వాదమేమంటే, "భాష సింబాలిక్, లిటరల్ కాదు, గనుక విశ్వం యొక్క నాశనాన్ని అది సూచింప వల్లపడదు." ఆ ఆర్గ్యూమెంట్ రెండంచులు గల ఖడ్గం అది యిరువైపుల ఖండించవచ్చు. తాత్కాలికమైన శిక్షకు లేక కడపటి శిక్షకు అది సింబాలిక్ కావచ్చు. అది సింబాలిక్ గనుక ఈ రెండింటిలో ఏదైనా సాధ్యమనే దాన్ని ఎత్తివేయలేం. [32]William Hendriksen, *More Than Conquerors* (Grand Rapids, Mich.: Baker Book House, 1954), 25. [33]"నాథా, యెందాక" అనే పాఠం ప్రకటన పుస్తకం 1లో 1:7 నోట్సు చూడు. [34]Owen L. Crouch, *Expository Preaching and Teaching: Revelation* (Joplin, Mo.: College Press Publishing Co., 1985), 123. [35]కీర్తనలు 94:1–7, 21–23 చూడు. [36]హెబ్రీయులకు 9:27. [37]Edward P. Myers, *After These Things I Saw: A Study of Revelation* (Joplin, Mo.: College Press Publishing Co., 1997), 160. [38]Will L. Thompson, "There's a Great Day Coming," *Songs of the Church,* ed. Alton H. Howard (West Monroe, La.: Howard Publishing Co., 1977). [39]Brother Pace, Judsonia church of Christ on Wednesday evening, 10 August 1997లో మాట్లాడాడు. [0]1 కొరింథీయులకు 10:4 చూడు; రోమా 9:33; 1 పేతురు 2:8లను కూడ చూడు.

[41]ఈ పాఠాన్ని ప్రసంగంగా చేస్తే, మార్కు 16:16; అపొస్తలుల కార్యములు 2:38; 22:16; గలతీయులకు 3:26, 27 వంటి లేఖన భాగాలను ఉపయోగించు. దీన్ని ప్రసంగంగా వాడితే, ముగింపులో హెబ్రీయులకు 12:25–29ని కూడ చేర్చు. ఈ భూమివంటి కదిలించబడేవి (సంఘు/రాజ్యమువంటి) కదిలించబడనివి తారతమ్యం చూపబడ్డాయి. శ్రోతలు దేవుని రాజ్య పౌరులు అంటే (సంఘ సభ్యులై ఉండాలనే విషయాన్ని నొక్కి చెప్పు). [42]Merrill C. Tenney, *Proclaiming the New Testament: The Book of Revelation* (Grand Rapids, Mich.: Baker Book House, 1963), 33-35.

## రివ్యూ మరియు చర్చ కొరకైన ప్రశ్నలు

1. ప్రకటన 6:12–17ను నీవు చదువునప్పుడు, ఏ మాటలు నీ మనస్సుకు వస్తాయి? ఏ ప్రాథమిక యింప్రెషన్‌తో ఆ దర్శనం నిన్ను విడుస్తుంది?
2. లోకం ఎలా అంతమౌతుందో వివరమైన, అక్షరార్థమైన చిత్రాన్ని ఈ భాగం యిస్తుందా? ప్రతి వివరణ అక్షరార్థమైనది కాదనడానికి ఏమి చేస్తుంది?
3. సూర్యుడు చీకటిగా మారడం, నక్షత్రాలు రాలడానికి సంబంధించిన పాత నిబంధన లేఖనాల సందర్భాన్ని చదువు. ఈ లేఖనాలు ఏమి బోధిస్తున్నాయో చర్చించడానికి సిద్ధపడు.
4. 15వ వచనంలో ఉపయోగించిన “రాజులు,” “ఘనులు,” వగైరా పదాలను చర్చించుము.
5. ఏనాడైనా నరుడు దేవుని యొద్దనుండి దాగగలిగెనా? నరులు అలా ఎందుకు ప్రయత్నిస్తున్నారు? దేవుని యొద్దనుండి నీ జీవితంలో ఏదైనా దాచ ప్రయత్నించావా?
6. “గొఱ్ఱెపిల్ల ఉగ్రత” అనే పదం నీకు వింతగా తోచిందా? అసాధారణమైనదిగా ఈ రచయితకు అది ఎందుకు తోచింది?
7. చర్చలోని లేఖనం రోమా సామ్రాజ్య నాశనాన్ని గూర్చియా లేక లోకాంతమును గూర్చియా? ఎందుకు?
8. ప్రకటన 6:12–17 జీవితాన్ని అర్థవంతంగా ఉండేలా ఎలా సహాయ పడుతుంది?
9. పాఠం ప్రకారం, లేఖనంలో ప్రాముఖ్యమైన ప్రశ్న ఏమి?
10. 7:9లో దేవుడు తన ఉగ్రతను కుమ్మరించినప్పుడు ఎవరు, రాబోవు అధ్యాయం ప్రకారం నిలువగలుగుతారు.

## మత్తయి 24 మరియు ప్రకటన 6

వ్యాఖ్యానకర్తలు తరచుగా మత్తయి 24ను ప్రకటన 6 ప్రక్కన పెట్టి, మత్తయి 24లో కూడ “యుద్ధములను గూర్చియు యుద్ధ సమాచారములను గూర్చియు,” “కరవులు,” క్రైస్తవుల హింసను సూచిస్తుంది (మత్తయి 24:6, 7, 9). ఈ పని విషయ పరిజ్ఞానం లేనిది – మత్తయి 24 (మార్కు 13, లూకా 21) ప్రకటన 6 రెండవ రాకడకు “సూచనలను” తెలిపేది ప్రాథమిక ఉద్దేశమని తలంచేటప్పుడు ప్రతిపాదనతో ఆరంభమౌతుంది.

మత్తయి 24:3లో శిష్యులు రెండు ప్రశ్నలడిగారు: ఒకటి దేవాలయ నాశనాన్ని గూర్చినది, రెండవది లోకాంతమును గూర్చినది. మత్తయి 24లోని తొలి భాగం ప్రాథమికంగా యెరూషలేము నాశనం గూర్చినది (15నుండి 20 వచనాలు గమనించు), ఆ అధ్యాయంలో చివరి భాగం రెండవ రాకడమీద దృష్టి నిలుపుతుంది. 6, 7, 9 వచనాలు

లోకాంతానికి కాదు, యెరూషలేము నాశనానికి సంబంధించినది.[1]

యుద్ధాలు, భూకంపాలు, కరవులు రెండవ రాకడ సమీపంగా ఉందని క్రీస్తు మాటలు చెప్పడమైతే, ఆయన తన్నుతాను ఖండించుకున్నట్టు చెప్పడమౌతుంది. అదే అధ్యాయంలో, రెండవ రాకడను గూర్చి ఆయన చెప్పినప్పుడు, "ఆ దినమును గూర్చియు ఆ గడియను గూర్చియు తండ్రి మాత్రమే (యెరుగును) గాని, యే మనుష్యుడైనను పరలోకమందలి దూతలైనను కుమారుడైనను ఎరుగరు" (36 వ.). అంతేకాదు, "మీరనుకొనని గడియలో మనుష్యకుమారుడు వచ్చును" అని కూడ ఆయన తెలియజేశారు (44బి వ.).

ఆయన వచ్చునప్పుడు జీవితం యథావిధిగా గడిచిపోతుందని ప్రభువు నొక్కి పలికారు (37–41 వచనాలు). "యుద్ధములు, యుద్ధ సమాచారములు," కరవులు, భూకంపములు, హింసలు, అబద్ధ బోధకులు ఆయన రాకడకు సూచనలు కావు. కాని, యివి జీవితంలో భాగం – లోకంలోనికి పాపపు ప్రవేశ ఫలితాలు.

---

సూచనలు

[1]మత్తయి 24లో "యుద్ధములు, యుద్ధ సమాచారములవంటివి" అసలు సూచనలే కావు అని యేసు సూచించారు (6 వ.).



**ఉగ్రత మహాదినము (6:12–17)**